ప్రచారం..ఇష్టారాజ్యం!

- నంద్యాలలో యథేచ్ఛగా అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల ఏర్పాటు
- అధికారికంగా 110 బోర్డులు, అనధికారంగా లెక్కలేనన్ని
- మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- పన్ను వసూళ్లలోనూ జాప్యం

పట్టణాల్లో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడానికి సంబంధిత మున్సిపాలిటీ నుంచి అనుమతులు పొందాల్సి ఉంది. వీటి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అనుమతులు ఇచ్చే సమయంలో ప్రచారానికి సంబంధించిన వివరాలతో పాటు ఏర్పాటు చేసే ప్రాంతాలు, బోర్డుల పరిమాణం, ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుంటారు. అయితే కొందరు అధికారుల అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా యాడ్స్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అనుమతి తీసుకున్న వాటికంటే అక్రమంగా ఏర్పాటు చేసిన వాటి సంఖ్య అధికంగా ఉంటున్నాయి. అన్నీ తెలిసిన యంత్రాంగం మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

నంద్యాల(రూరల్):నంద్యాల మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం వ్యాపారులకు వరంగా మారింది.అనధికారికంగా ప్రచార బోర్డులు ఏర్పాటు చేసినా ఏ మాత్రం పట్టించుకోరనే ధీమాతో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అయితే ఉన్నతాధికారులు ప్రశ్నిస్తారనో? లేదా ముఖ్య నాయకుల, ప్రభుత్వాధినేతల పర్యటనల సమయంలో మాత్రమే కొన్నింటిని తొలగించి చేతులు దులుపుకుంటున్నారు. ఇక అనుమతి తీసుకున్న బోర్డుల యజమానుల నుంచి పన్ను వసూలులోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

విచ్చలవిడిగా అనధికారిక బోర్డులు..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, పద్మావతి నగర్, టెక్కె, నూనెపల్లె, రైల్వేస్టేషన్, శ్యామకాలువ, ఆర్టీసీ బస్టాండ్, గాంధీ చౌక్, ఆత్మకూరు బస్టాండ్, శ్రీనివాససెంటర్ తదితర ప్రాంతాల్లో అనధికారికంగా బోర్డులను, డివైండర్ మధ్యలో వ్యాపార సంస్థల, నాయకుల పుట్టిన రోజుకు సంబంధించిన ఏర్పాటు చేసి, రోజులు గడుస్తున్నప్పటికీ వాటిని తొలగించడంలేదు.. వాస్తవంగా ఈ బోర్డులను ఏజెన్సీలు ప్రకటనలు వేసుకుని రూ.లక్షల్లో డబ్బులు సంపాదించుకుంటున్నాయి. బోర్డులు ఏర్పాటు చేసినందుకు మున్సిపాలిటీకి పన్ను చెల్లించడం లేదు. అయితే ఇందుకు కొందరు అధికారుల తీరు కారణమనే విమర్శలున్నాయి. దీంతో అనధికార బోర్డులపై వారు ప్రశ్నించడం, చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల కమిషనర్ ఆదేశాలతో అధికారులు అనధికార బోర్డుల తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో బోర్డులను తొలగించక పోవడం గమనార్హం.



టెక్కె సమీపంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

నిద్రమత్తులో అధికారులు..

అడ్వర్‌టైజ్‌మెంట్ పన్ను వసూళ్లలోనూ టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ సంస్థ పరిధిలో 110 బోర్డులు/హోర్డింగ్స్, తదితర వాటిని ఏర్పాటు చేశారు. వాస్తవంగా వివిధ ఏజెన్సీల పరిధిలో వీటిని ఏర్పాటు చేశారు. వీటికి సంబంధించి 2023-24లో మొత్తం రూ.40 లక్షలు వసూలు కావాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు రూ.30 లక్షలు మాత్రమే వసూలు చేశారు. గతేడాదికి సంబంధించి బకాయిలు రావాల్సి ఉంది. ప్రచార ఏజెన్సీలు నిర్వాహకుల నుంచి ముందస్తుగానే ప్రకటనల ఏర్పాటుకు సంబంధించి డబ్బులు వసూలు చేసుకుంటాయి. కానీ మున్సిపల్ సంస్థ అధికారులకు చెల్లించడం లో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మేలుకుని వసూళ్ల వేగ వంతం చేస్తారో లేదో వేచి చూడాలి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

అనధికారికంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్న మాట వాస్తవమే. ఇటీవల వాటిని గుర్తించి, తొలగించే చర్యలు తీసుకున్నాం. మున్సిపల్ అధికారుల అనుమతులు లేకుండా బోర్డులను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు. అడ్వర్‌టైజ్‌మెంట్ పన్ను వసూళ్లను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అనుమతులు లేకుండా ప్రచార చిత్రాలు, బోర్డులు ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– మూర్తి, ఏసీపీ, నంద్యాల మున్సిపల్ కార్యాలయం

క్లుప్తంగా

పాడి రైతులకు రాయితీపై దాణా



పాడి రైతులకు దాణా అందజేస్తున్న పశు వైద్యాధికారి

ఉయ్యాలవాడ: పాడి రైతులకు రాయితీపై దాణా అందజేస్తున్నట్లు పశువైద్యాధికారిణి నాగ శైలజ తెలిపారు. సోమవారం పలువురు రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణాను పంపిణీ చేశారు. మండలంలోని హరివరం, అల్లూరు, ఇంజేడు,ఉయ్యాలవాడ పశు వైద్యశాలల పరిధిలో 25 టన్నులు మంజూరైనట్లు తెలిపారు. 200 కిలోల పశువుల దాణా సబ్సిడీపై రూ. 1300లకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. దాణా కావాల్సిన రైతులు పశు వైద్యశాల లేదా రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏపీఎంగా రాజశేఖర్‌రెడ్డి

శిరివెళ్ల: డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎంగా రాజశేఖర్ రెడ్డి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన బండిఆత్మకూరు నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి ఏపీఎం పుణ్యవతి నంద్యాల డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే సీసీలు రామచంద్రుడు దొర్నిపాడుకు, రాముడు కల్లూరు మండలం చిన్న టేకూరుకు, శ్రీనివాసులు నంద్యాలకు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో రుద్రవరం నుంచి దేవానందం, శ్రీశైలం నుంచి అయ్యన్న, నంద్యాల నుంచి శేఖర్ వచ్చారు.

వీఆర్వోల బదిలీ

శిరివెళ్ల: మండలంలో పలువురు వీఆర్వోలు బదిలీ అయినట్లు తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. గోవిందపల్లె వీఆర్వో మోహన్‌రెడ్డి గోస్పాడు మండలం జూలేపల్లెకు బదిలీ అయ్యారు. కృష్ణయ్య జిల్లెలకు, చెన్నూరు వీఆర్వో భాస్కరరెడ్డి యాళ్లూరుకు, యర్రగుంట్ల వీఆర్వో మహ్మద్ రఫీ ఎం.కృష్ణాపురం, గంగవరం వీఆర్వో నరసింహుడు రుద్రవరం మండలం చిన్న కంబలూరు, శిరివెళ్ల 2వ గ్రామ సచివాలయ వీర్వో చెన్నయ్య మహదేవపురానికి బదిలీ అయినట్లు వెల్లడించారు.

నేడు ప్రత్యేక సమావేశం

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. 'మన ఇళ్లు మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఈఓపీఆర్డీ, హౌసింగ్, ఉపాధి ఏపీఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు



రుద్రవరం అటవీ కార్యాలయ ప్రాంగణంలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

రుద్రవరం: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని.. పర్యావరణంతో పాటు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు అన్నారు. స్థానిక అటవీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. వ్యర్థాలు, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మనుగడ సాగాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని.. ముఖ్యంగా మొక్కలను విరివిగా నాటాలని సూచించారు.

బిల్లుల చెల్లింపునకు పరిశీలన

శిరివెళ్ల: 2014-15వ సంవత్సరంలో జరిగిన ఇళ్ల నిర్మాణాల బిల్లుల చెల్లింపులకు క్షేత్ర స్థాయి పరిశీలన జరుగుతుందని హౌసింగ్ ఏఈ నాగశేఖర్ సోమవారం తెలిపారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో మండలంలో 749 ఇళ్లు మంజూరు కాగా అందులో 455 పక్కా గృహాలు పూర్తయ్యాయి. వాటికి సంబంధించి రూ. 7.40 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉండంగా రూ. 5 కోట్ల చెల్లింపులు గతంలో జరిగాయి. మిగిలిన బిల్లుల చెల్లింపునకు చర్యలు మొదలయ్యాయని తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు మృతి

శిరివెళ్ల: అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్ఐ చిన్న పీరయ్య వివరాల మేరకు.. మండలంలోని ఇసుకపల్లెకు చెందిన మూగ చిన్న నారాయణ (69) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నెల 22వ తేదీ జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కర్నూలు ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్యం విషమించడంతో సోమవారం మృతిచెందాడు. కుమారుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వసతి గృహానికి ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు పంపిణీ

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహానికి జిల్లా కలెక్టర్ రాజకుమారి 25 ట్యూబ్‌లైట్లు, 10 ఫ్యాన్లను పంపిణీ చేశారు. వార్డెన్ ముంతాజ్‌బేగం, జిల్లా బీసీ సంక్షేమాధికారి ముస్తాక్ అహమ్మద్‌కు సోమవారం అందజేశారు. హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని కలెక్టర్ వారిని ఆదేశించారు.



హాస్టళ్లకు ఫ్యాన్లు అందజేస్తున్న కలెక్టర్

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ..

బండిఆత్మకూరు మండలానికి చెందిన రమణారెడ్డి, నంద్యాల మండలం మిట్నాల గ్రామానికి చెందిన వేణుగోపాల్‌కు జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం మూడు చక్రాల సైకిళ్లను అందజేశారు. ఇటీవల నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ట్రైసైకిళ్లు కావాలని దివ్యాంగులు కోరగా స్పందించిన కలెక్టర్ సైకిళ్లను అందించి ఆదుకున్నారు.

అభివృద్ధి ప్రణాళికలను రూపొందించండి

నంద్యాల(అర్బన్): స్వర్ణాంధ్ర - 2047 దార్శనిక పత్ర రూపకల్పనలో భాగంగా జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కీలక రంగాలపైన దృష్టి సారించి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించి ప్రణాళికలో భాగస్వాములను చేయాలన్నారు. మండల విజన్ ప్రణాళికలను ఈనెల 30వ తేదీలోపు, జిల్లా విజన్ ప్రణాళికలను అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ఎందుకు పర్యవేక్షణ చేయలేకపోతున్నారని ప్రశ్నించారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బ్లాక్‌డేలో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి సుంకయ్య,ఉపాధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ కాంప్లెక్స్ ఎదుట కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించామన్నారు. నాయకులు శ్రీనివాసులు,సోమన్న,సుబ్బరాయుడు,మురళి,గులాం పాల్గొన్నారు.అలాగే.. సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లో దేశవ్యాప్త బ్లాక్‌డే పిలుపులో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నాలుగు లేబర్‌కోడ్స్‌లను రద్దు చేయాలని డిమాండు చేశారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కనీస వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వాసుపత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు కనీస వేతనాలు అందజేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ప్రసాద్,చెన్నయ్య పాల్గొన్నారు. అలాగే.. ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రాజ,ఎంఆర్ నాయక్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యరంగాన్ని పట్టించుకోలేదన్నారు. అశోక్,హరివర్ధన్,సతీష్,రంగ,వెంకటేశ్,హసన్ పాల్గొన్నారు. గడివేములలో ఈ నెల 5న నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవన ప్రారంభ శిలాఫలకంలో తన పేరు లేకుండా చేశారని, ప్రోటోకాల్ పాటించ లేదని ఎంపీటీసీ-1 వంగాల మహేశ్వరరెడ్డి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంజినీరింగ్,గ్రంథాలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏ మొహం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్తున్నారు?

ఆళ్లగడ్డ: సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చిన టీడీపీ ఏ మొహం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్తున్నారని.. ఇది మంచి ప్రభుత్వం కాదని ముంచే ప్రభుత్వం అని వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిశోర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచితబస్సు, ఆడబిడ్డ నిధి పేరిట నెలకు రూ.1500 ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన హామీలు ఏమయ్యాయన్నారు. అమరావతిలో వరదల పేరిట ఉద్యోగుల జీతాల్లో కోతపెట్టారన్నారు. 164 మంది ఎమ్మెల్యేలు ఒక్కరైనా వారి జీతం నుంచి ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు చెప్పాలే కాని సొంతంగా డబ్బా కొట్టుకోవడం కాదన్నారు. ఏ నియోజకవర్గంలో చూసినా అరాచకాలు ఎక్కువయ్యాయని అన్నారు. ఇసుక ఉచితం అన్నారు... ఆళ్లగడ్డకు 20 టన్నుల ఇసుక ఆళ్లగడ్డకు చేరాలంటే రూ. 26 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఆ రోజు పవన్‌కళ్యాణ్ హామీలకు నేను పూచీ అన్నారు.. ఇప్పుడు ఏమైంది మీ పూచి అని ఎద్దేవా చేశారు. తిరుపతి లడ్డూపై కూడా రాజకీయం చేసే నీచులని మండిపడ్డారు. కేవలం వందరోజుల ఏం చేశారని ప్రజలు ప్రశ్నిస్తారనే ఉద్దేశంతోనే డైవర్ట్ చేయడానికి తిరుమల లడ్డు ప్రస్తావన తెచ్చారన్నారు. దమ్మంటే సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలన్నారు. రైతులు ఖరీఫ్ ముగిసి రబీలోకి వస్తున్నారని ఇంత వరకు పెట్టుబడి సాయం అందలేదన్నారు. ప్రజలు నిలదీసే కాలం దగ్గరలోనే ఉందన్నారు.



మాట్లాడుతున్న భూమా కిశోర్‌రెడ్డి

శ్రీశైలం నుంచి మహానందికి రానున్న ఉద్యోగులు

మహానంది: దేవదాయశాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీశైలం ఆలయం నుంచి పలువురు ఉద్యోగులు మహానంది దేవస్థానానికి రానున్నారు. శ్రీశైలంలో విధులు నిర్వహిస్తున్న ఏఈఓ ఎం.హరిదాసు, సూపరింటెండెంట్ పి.దేవిక, సీనియర్ అసిస్టెంట్లు పి.సుబ్బారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి మహానందికి బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్లు వెంకటలక్ష్మీ, అనురాధ, లోకేశ్వరప్ప, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసప్రసాద్‌ను మహానందికి బదిలీ చేస్తూ ఆ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మహానందిలో జూనియర్ అసిస్టెంట్ హరినాథ్‌ను శ్రీశైలం బదిలీ చేశారు.

ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): ది నంద్యాల ఫొటో ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం బాబు ఎన్నికయ్యారు. ప్రథమనంది ఆలయంలో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్‌గా సలీం బాషా, కార్యదర్శిగా ఆంజనేయులు, ట్రెజరర్‌గా రమేష్ బాబు, సభ్యులుగా సుభాన్, సురేష్, మహేశ్వరెడ్డి, శివకుమారరెడ్డి, బాషా ఎన్నికయ్యారు. చిలపల్లె వాసు, విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన ప్రవచనాలు



ప్రవచనాలు వినిపిస్తున్న హయగ్రీవా చార్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో కోటవీధిలో వెలసిన శ్రీ రమా సమేత సత్యనారాయణ దేవస్థానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న దేవి భాగవత ప్రవచనాలు సోమవారం ముగిశాయి. తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత హయగ్రీవాచార్యులు మాట్లాడుతూ పరమ పావని జగదాంబ త్రిమూర్తులకు సృష్టించే శక్తి పాలించే శక్తిని ప్రసాదించిందని వివరించారు. అనంతరం హయాగ్రీవాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈఓ నాగప్రసాద్ చైర్మన్ యాడికి శ్రీదేవి, సురేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

నంద్యాల(రూరల్): పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు నంద్యాల డిప్యూటీ డిఎంహెచ్ఓ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ ప్రభుత్వ వైద్యులతో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేశారు.

అటవీ శాఖలో పదోన్నతుల బదిలీలు

రుద్రవరం: అటవీశాఖ పరిధిలోని రుద్రవరం, చెలిమ రేంజిల్లో పలువురు ఉద్యోగులు పదోన్నతులు పొంది స్థానచలనం అయినట్లు రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు సోమవారం తెలిపారు. ఎఫ్‌బీఓగా ఉన్న రామకృష్ణ ఫారెస్టర్‌గా పదోన్నతి పొంది రుద్రవరం రేంజిలోని డీవీ పంట సెక్షన్ అధికారిగా స్థానచలనం పొందారు. మరో ఎఫ్‌బీఓ నాగేంద్రయ్య ఫారెస్టర్‌గా పదోన్నతి పొంది నంద్యాల డివిజన్ మొబైల్ పార్టీకి వెళ్లారు. రుద్రవరంలో డాగ్ స్క్వాడ్ ఎఫ్‌బీఓ మాబుఖాన్ డాగ్ స్క్వాడ్‌లోనే ఫారెస్టర్‌గా, అహోబిలం ఎఫ్‌బీఓ విజయవర్ధన్ ఫారెస్టర్‌గా పదోన్నతి పొంది చెలిమ రేంజికి బదిలీ అయ్యారు. చెలిమ రేంజి కోటకొండ బీట్ ఎఫ్‌బీఓ రామేశ్వరి ఫారెస్టర్‌గా పదోన్నతి పొంది ఓంకారం సెక్షన్‌కు బదిలీ అయ్యారు. అలాగే గాజులపల్లె డిపోకు చెందిన ఫారెస్టర్ కాశీం నాయక్ రుద్రవరం సెక్షన్‌కు, రుద్రవరం సెక్షన్ అధికారి నాగరాజు జీసీ పాలెంకు, కర్నూలు నుంచి ఎఫ్‌బీఓ సరస్వతిని రుద్రవరం రేంజి ఊట్ల బీట్‌కు బదిలీ అయినట్లు రేంజర్ వివరించారు.

కుర్చీలు ఖాళీ.. ఎవరితో మాట్లాడాలి



దొర్నిపాడులో ఖాళీ కుర్చీలతో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

దొర్నిపాడు: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆయా మండలాల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరు కావాల్సి ఉంది. కానీ సోమవారం జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ రాజకుమారి ఉదయం 9:30 గంటలకే వచ్చారు. అయినా అధికారులెవరూ హాజరు కాలేదు. ఇక దొర్నిపాడులో అయితే ఉదయం 10 గంటలు దాటినా ఖాళీ కుర్చీలే దర్శనం ఇచ్చాయి. దొర్నిపాడు నుంచి ఎవరూ హాజరుకాలేదని కలెక్టర్ అంటున్నారని ఆఫీస్ నుంచి సిబ్బంది ఆయా అధికారులకు ఫోన్ చేయగా ఉరుకులు పరుగులతో వచ్చారు.

రెవెన్యూ కార్యాలయంలో పలువురి బదిలీ

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏడుగురు అధికారులు బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్ అనురాధ పాణ్యం మండలానికి, ఆర్ఐలు తులసీక్రిష్ణ, సత్తార్ సంజామల, చాగలమర్రి మండలాలకు బదిలీ అయ్యారు. బోడెమ్మనూరు వీఆర్ఓ నరసింహారెడ్డి, కొండుపల్లె వీఆర్ఓ ఓబులేస్ కోవెలకుంట్ల మండలం, సుద్దమల్ల వీఆర్ఓ రవిప్రసాద్ గోస్పాడు మండలం, ఆర్.జంబులదిన్నె వీఆర్ఓ వేణుగోపాలు శిరివెళ్ల మండలానికి బదిలీ అయ్యారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఉయ్యాలవాడ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు ప్రకాష్, రాబర్ట్‌కెనడీ అన్నారు. సోమవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాయలూరు, ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ మహిధర్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బుక్ కీపర్‌ల చేతి వాటం

- పొదుపు రుణాల మంజూరులో ఇష్టారాజ్యం
- రుణం మంజూరైతే మామూళ్ల వసూలు
- నెలకు ఒక్కొక్కరు రూ.100 చెల్లించాల్సిందే
- అక్రమాలకు అండగా టీడీపీ నాయకులు!

నంద్యాల(అర్బన్): మండలంలోని పోలూరు గ్రామ పొదుపు సంఘాలకు మంజూరయ్యే రుణాల్లో బుక్ కీపర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో గ్రామాల్లో కొత్త బుక్ కీపర్లు ఏర్పాటయ్యారు.160 గ్రూపులు ఉన్న గ్రామంలో ఐదుగురు బుక్ కీపర్లు ఉన్నారు. నెల వారీగా సమావేశాలు నిర్వహించి చెల్లింపులు, రుణాల మంజూరు, సంఘాల పురోగతిపై చర్చించాల్సి ఉంది. కొత్త బుక్ కీపర్లు ఏర్పాటై మూడు మాసాలు గడుస్తున్నా.. ఇంత వరకు ఒక్క సమావేశాన్ని నిర్వహించలేదన్న విమర్శలు ఉన్నాయి. 160 గ్రూపులు ఉన్న గ్రామంలో నెలకు ఆరేడు గ్రూపులకు రుణాలు మంజూరు అవుతుంటాయి. స్థానిక టీడీపీ నేతల సహకారంతో బుక్ కీపర్లు కొత్త రుణాలు మంజూరైన ప్రతి గ్రూపు నుంచి రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. బుక్ కీపర్ ఒక్కొక్కరికి ప్రభుత్వం నెలకు రూ.8వేల వేతనం చెల్లిస్తుండగా, గ్రూపు సమావేశాలు నిర్వహించకపోయినా ప్రతి నెల ఒక్కో సభ్యురాలు రూ.100 చెల్లిస్తున్నారు. అలాగే.. రుణాలు మంజూరైన ప్రతిసారీ గ్రూపుల వారిగా కొంత మొత్తాన్ని బలవంతంగా వసూళ్లు చేస్తున్నారు. విషయాన్ని నంద్యాల మండల ఐకేపీ సీసీ శ్రీనివాసులు, ఏపీఎం గుర్రప్పల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని, పొదుపు మహిళలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని 160 గ్రూపులతో సమావేశం నిర్వహించి పొదుపు సభ్యుల సమస్యలు తెలుసుకోవాలని కోరుతున్నారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు

చాగలమర్రి: మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం అవుతుందని.. యువత వాటికి దూరంగా ఉండాలని ఎంఈఓ-2 న్యామతుల్లా, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఓరియంటల్ బాలికల ఉన్నత పాఠశాలలో మనం బ్లడ్ డోనర్స్, సహారా సోషల్ సర్వీసెస్, అనాథ రక్షక్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల యువత గంజాయి, హెరాయిన్, మద్యం తదితర మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని తెలిపారు. వీటి వల్ల ఆరోగ్యం దెబ్బతిని భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. విద్యార్థులు విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హుసేన్ బిలాల్, ఎం.మహ్మద్ రఫీ, సాయి సుదర్శనరావు, సుబ్రమణ్యం, మాబాషా పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సభ్యులు

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రి పాత పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఈఓపీఆర్డీ తాహీర్ హుసేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకంగా వ్యవహరిస్తారన్నారు. అనంతరం వైద్యాధికారిణి అంజలి సుమారు 40 మంది కార్మికులకు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పలు సలహాలు, సూచనలు చేశారు. 24 మందికి మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, ఏఈలు కొండారెడ్డి, జగ్గయ్య, ఐసీడీసీ సూపర్‌వైజర్ సుశీల, పంచాయతీ కార్యదర్శులు ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, ఎల్‌టీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి అంజలి

పిచ్చిమొక్కల తొలగింపు

రుద్రవరం: ఎల్లావత్తుల-శ్రీరంగాపురం ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. స్పందించిన సర్పంచ్ సుబ్బమ్మ సోమవారం జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించి రాకపోకలను సులభతరం చేశారు. అలాగే డీ.కొట్టాల ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న సీసీ రోడ్డుపై నిరంతరం మురుగు నిల్వ ఉంటుండంతో సర్పంచ్ నరసింహ్మారెడ్డి జేసీబీతో మురుగును తొలగించి శుభ్రం చేయించారు.



ఎల్లావత్తుల-శ్రీరంగాపురం రోడ్డులో పరిశుభ్రత పనులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నంద్యాల, ఆళ్ళగడ్డ
99122 20581 (నంద్యాల)
70750 09103 (ఆళ్ళగడ్డ)
Office mail : sakshiknladvt@gmail.com